
## కథ

-నూకల విజయకుమార్




**అన్నీ పద్ధతి ప్రకారంగా జరగాలనుకునే మనస్తత్వం చిదంబరరావుది. అలా అనుకోవడం తప్పు కాదు. అయితే పద్ధతి ప్రకారం జరక్కపోతేమటుకు ఎవరైనా, ఎంతటి వారైనా సరే వారిపై చిందులు తొక్కి వారిని ఉతికి ఆరేస్తాడు. అందుకే ఆయన్ని అందరూ 'చిందుల చిదంబరం' అని కూడా పిలుస్తుంటారు.**

ప్రతీ చిన్న పనీ పద్ధతి ప్రకారం జరగాలని పట్టుపడుతూంటాడు. ఇంట్లో అయినా మరెక్కడయినా, పొద్దున్నే బ్రష్ చేసుకునేటప్పుడు మొదలుపెట్టే ఆయన పద్ధతుల పద్దు, రాత్రి పడుకునే వరకు సాగాల్సిందే. ఏమాత్రం తేడా వచ్చినా ఇక ఆ రోజంతా చిందులు తొక్కుతూనే ఉంటాడు చిదంబరం ఉరఫ్ చిందుల చిదంబరం. ఆయన సంగతి తెలిసిన భార్యా పిల్లలు కూడా ఆయన ఇంట్లో ఉన్నంతసేపూ పద్ధతి ప్రకారం నడుచుకుంటూ ఉంటారు. ఇష్టపడి కాదు కష్టపడి. ఆయన చిందులకి భయపడి.

జీవితమంతా పద్ధతి ప్రకారం గడపాలనీ, పద్ధతులు పాటించకుండా ఉంటే ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ, పాటించే పద్ధతులన్నీ అందరికీ తెలియపరచి, ఉపయోగకరంగా ఉండేలా ఒక పెద్ద గ్రంథాన్ని కూడా రాయాలనుకుంటున్న తన సంకల్పాన్ని, బంధుమిత్ర వర్గానికి కలిసినప్పుడల్లా ఊదరగొట్టేసేవాడు. వారంతా వెనకాల చిదంబరం గురించి హేళనగా, చులకనగా చేసే కామెంట్లు, చిదంబరం శ్రీమతికి ఎంతో బాధను కలిగించేవి. ఎలాగైనా తన భర్తలో మార్పును కలిగించమని భగవంతుణ్ని ప్రార్థించేది. ఏ దేవుడు కరుణించాడో కానీ, ఒక చిన్న సంఘటన చిదంబరరావుని ఆ గ్రంథం రాయకుండా ఆపింది. బంధుమిత్రులను ఆ గ్రంథం చదివే దౌర్భాగ్యం నుంచి కాపాడింది. అదేంటంటే...

★ ★ ★

ఉదయం లేవగానే తొడుక్కునేందుకు వీలుగా చెప్పులను మంచం మొదట్లోనే పద్ధతి ప్రకారం పెట్టుకుని పడుకోవడం చిదంబరం అలవాటు. మంచం దిగుతూనే కాళ్లను చెప్పుల్లోకి దూర్చేసి, బాత్రూమ్‌కి వెళ్లి, బ్రష్ చేసుకోవడంతో తన దినచర్యను పద్ధతి ప్రకారంగా ప్రారంభిస్తాడు. ఏదైనా తేడా వస్తే, 'తన దినచర్య' 'తద్దిన చర్యగా' మారి ఆ రోజంతా ఛండాలంగా మారిపోతుందన్న నెగటివ్ ఆలోచన అతని నరనరాల్లో జీర్ణించుకుపోయింది. అందుకే నిద్రలేచింది మొదలు అందర్నీ పద్ధతీ, పద్ధతీ అంటూ ఒక పద్ధతి ప్రకారంగా పీక్కుతినడం, అతనికీ అతని భార్యాపిల్లలకు ఒక రకంగా అలవాటయిపోయింది.

ఒకరోజు పద్ధతి ప్రకారంగానే సూర్యుడు ఉదయించే సమయానికి నిద్రలేచిన చిదంబరం, కాళ్ల దగ్గర ఉండవలసిన చెప్పులు దూర్చేద్దామనుకున్న కాళ్లకి అందకపోయేసరికి, అరికాలి మంట నోటికెక్కి, గట్టిగా అరుపు రూపంలో బయటకొచ్చింది.

''ఏమేవ్! నా చెప్పులెక్కడ తగలడ్డాయి?'' ఘీంకరించాడు చిదంబరం కాల్లో ముల్లు దిగిన ఏనుగులా.

''అదేంటండీ, మీరు పడుకునే ముందు పద్ధతి ప్రకారం మంచం పక్కనే పెట్టుకుంటారుగా. ఇప్పుడవి ఎక్కడున్నాయి అంటూ నన్నడగడం పద్ధతిగా లేదండీ'' కొంచెం వ్యంగ్యంగానే చెప్పింది శ్రీమతి.

ఆవిడ చెప్పిన తీరు పద్ధతి ప్రకారం లేకపోయినందుకు మండుకొచ్చింది చిదంబరానికి. విసుక్కుంటూనే బాత్రూంలోకి దూరాడు. విసుగ్గా బ్రష్ తీసుకొని విసురుగా దానిమీద పేస్ట్ పులిమి, నోట్లో పెట్టుకుంటుండగా గమనించాడు. ఆ బ్రష్ తనది కాదు. తన అత్తగారిది. అత్తగారు తన కట్టుడుపళ్లని తోమడానికి ఉపయోగించే చెత్త బ్రష్ కొంచెంలో తన నోట్లోకి దూరిపోయుండేదన్న ఆలోచన రాగానే 'దరిద్రం' అంటూ గట్టిగా నేలను తన్నాడు చిదంబరం. న్యూటన్ థర్డ్‌లా గనక పద్ధతి ప్రకారం పనిచేసుంటే అతని తల రూఫ్‌కి తగిలి రూఫో తలో ఏది గట్టిదయితే రెండోది పగిలిపోవడం పద్ధతి ప్రకారం జరిగి ఉండేదే. కానీ చిదంబరం కాలు కొంచెం బెణకడంతో ఆగిపోయింది.

అత్తగారి బ్రష్‌ని గట్టిగా నేలపైకి విసిరి ''నా బ్రష్ పక్కన ఎవరి బ్రష్షూ పెట్టొద్దని ఎన్నిసార్లు చెప్పాను. ఛీ..ఛీ.. ఇన్నేళ్లుగా మొత్తుకుంటున్నా ఈ ఇంట్లో ఎవ్వరికీ పద్ధతులు వంటపట్టలేదు'' అని అరుచుకుంటూ తన బ్రష్‌ని పేస్టుతో పులిమి, పళ్లన్నీ ఊడిపోతాయేమోనన్నంత భయంకరంగా బరబరా తోమసాగాడు కోపంలో పద్ధతిని మరచిపోయి. గిన్నెలు కడగడానికి అక్కడికి వచ్చిన పనిమనిషి, చిదంబరం పళ్లు తోముతున్న దృశ్యం చూసి ''పక్కింట్లో పని చూసుకొని మళ్లీ వస్తానమ్మా'' అంటూ పారిపోయింది.

తన ముఖంలోని భావాల్ని ఏమాత్రం మార్చకుండా అలాగే భయంకరంగా పెట్టి, టవల్ అందుకొని ముఖాన్ని తుడుచుకోసాగాడు. దురద పెట్టిన ఎద్దు శరీరాన్ని గోడకు రుద్దుకునే దృశ్యాన్ని తలపింపజేస్తూ.

''కాఫీ...'' ఓండ్రపెట్టాడు చిదంబరం. ఉదయం నుంచీ జరుగుతున్న సంఘటనల వల్ల బి.పి. పెరిగిపోవడం వలన. అప్పటికింకా నిద్రలేవని చిన్నకొడుకు ఉలిక్కిపడి లేచి ఆరున్నొక్క రాగం అందుకున్నాడు. చదువుకుంటున్న పెద్ద

**ఆంధ్రభూమి దిన పత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**

కొడుకు చేతిలోంచి పుస్తకం జారి కింద పడిపోయింది.

'పద్ధతి ప్రకారం పదిహేను నిమిషాలకి తక్కువ తోమని పళ్లని, ఇంత తొందరగా ఎలా లాగించాడబ్బా?' అనుకుంటూ, పదినిమిషాలు కలపాల్సిన కాఫీని, ఎనిమిది నిమిషాలకే కుదించేసి, చిదంబరానికి అందించి చిన్నవాడి వీపు మీద సముదాయింపుగా చరుస్తూ..

''దడుచుకున్నావా బాబూ.. భయపడకు. బ్రహ్మరాక్షసుడు కాదులే. మీ నాన్నే'' అంటూ బుజ్జగించసాగింది. అంతలోపే-

''ఇది కాఫీనా.. పశువులు తాగే కుడితా?'' అన్న రంకె వినిపించడంతో కిటికీలోంచి బయటకు చూసింది ఎడ్లు ఏమన్నా దెబ్బలాడుకుంటున్నాయేమోనని అనుమానమొచ్చి. అయితే అవి ప్రశాంతంగా నెమరువేసుకుంటూ కూర్చుని ఉండడంతో, ఇది తన శ్రీవారి గోలే అయ్యుంటుందని గమనించి ''ఏమైందండీ'' అంటూ కంగారుగా హాల్లోకి వచ్చింది.




''నా బొంద్దైంది. కాఫీలో పంచదార పలుచనైంది. ఛ..ఛ. ఇంక ఈ రోజంతా ఛండాలమే'' అనుకుంటూ శ్రీమతి వైపు కొరకరా చూస్తూ, బాత్రూం వైపు చరచరా బయలుదేరాడు చిదంబరం చిందులేసుకుంటూ.

అంతకుముందే నల్లా తిప్పి ఉండడంతో బకెట్ సగానికి పైగానే నిండి ఉంది. పద్ధతి ప్రకారంగా అన్ని పనులూ చేయడానికి తన శ్రీమతి ఈపాటికి అలవాటు పడి ఉంటుందన్న గట్టి నమ్మకంతో, మగ్ ముంచి వంటిపై నీళ్లు పోసుకున్న చిదంబరం ''చచ్చానురోయ్'' అంటూ పులిలా గాండ్రించాలనుకుని, చలికి మాట పెగలక కోతిలా కిచకిచలాడాడు.

'మళ్లీ ఏ పద్ధతి మారింది రా మొగుడా..'' అనుకుంటూ, బాత్రూం దగ్గరకు వచ్చి, ''ఏమైందండీ'' కాస్త కంగారుగానే అడిగింది శ్రీమతి.

''ఇవ్వాళేమైందే నీకు. గీజర్ ఆన్ చేయకుండానే నల్లా తిప్పావ్. చన్నీళ్లు వంటిపై పడగానే పై ప్రాణాలు పైనే పోయాయ్ తెలుసా''

కాస్త చలి తగ్గడంతో కిచకిచలు మాని, ఒరిజినల్ లెవెల్లోనే ఓండ్రపెట్టాడు చిదంబరం.

''అయ్యయ్యో.. లేదండీ. నేను గీజర్ ఆన్ చేసిన తర్వాతనే నల్లా తిప్పానండీ. సరిగ్గా చూడండి'' అమాయకంగా చెప్పింది శ్రీమతి.

కరెంట్ పోయిన సంగతి గమనించి కరెంట్ షాక్ కొట్టిన కాకిలా వణుకుతూనే స్నానం ముగించాడు చిదంబరం.

'ఈయన ఆఫీసుకు వెళ్లే లోపు ఎన్ని విన్యాసాలు, మిమిక్రీలు చేస్తాడో' అనుకుంటూ, ఆయనకి టిఫిన్ రెడీ చేసి, మధ్యమధ్యలో దేవుడికి దండం పెట్టుకుంటోంది శ్రీమతి. దేవుడు ఆవిడ గోడు విన్నాడేమో చిదంబరం ఇంకేమి విన్యాసాలు చేయకుండానే, చొక్కాలోకి చేతుల్ని, ప్యాంటులోకి కాళ్లనీ పద్ధతి ప్రకారం దూర్చేసి, టేబుల్ మీద పెట్టిన టిఫిన్ని కూడా ఇంట్లో వాళ్లని కంగారు పెట్టకుండా తినేసి ''ఆఫీసుకి వెళ్తున్నా'' అన్న అర్థం స్ఫురించేలా ఒక చూపు చూసి, ప్రతీరోజూ ఆఫీసుకి వెళ్లేవాడు. పద్ధతి ప్రకారంగా ఎలా నడుస్తాడో అదే స్టైల్లో దడుచుకుంటూ బయటపడ్డాడు చిదంబరం.

ఎదురుగా వస్తున్న ఆటోని పిలిచాడు. వాడొచ్చి పక్కనే ఆగేసరికి పద్ధతికి విరుద్ధంగా జరిగినా కోపం రాలేదు చిదంబరానికి. ఎందుకంటే తనకు ఏదైనా అనుకూలంగా జరిగినప్పుడు పద్ధతుల గురించి ఆలోచించడు కాబట్టి. ఆటోలో కూర్చొని 'అబ్బా! ఈ రోజు పొద్దున్నుంచి ఇదొక్కటే కాస్త ఊరట కలిగించిన విషయం' అని అనుకుంటుండగానే, పది గజాలు పోగానే 'బర్ర్ర్'మంటూ ఆగిపోయింది ఆటో.

''సారీ సార్! పెట్రోల్ అయిపోయింది. వేరే ఆటో చూస్కోండి'' చెప్పాడు ఆటో అతను.

చిదంబరం చిరాకు అంబరాన్ని అంటింది.

''అసలు పెట్రోల్ ఉందో లేదో చూస్కోకుండా ఆటో బయటకు ఎలా తీశావ్? ఆమాత్రం పద్ధతి ప్రకారం ఉండకపోతే జీవితంలో పైకి ఎలా వస్తావ్?'' అని చెప్పబోయి-

తను చెప్పేవన్నీ, గాలికి ఊగే చెట్లలా తలాడిస్తూ వినడానికి వీడేమన్నా నా శ్రీమతా, తంతా

డేమోనని తమాయించుకుని, అటు ఇటూ చూస్తూ ఇంకో ఆటోని పిలిచాడు.

''ఆటోలో పెట్రోలుందా?'' అడిగాడు చిదంబరం.

అసంబద్ధమైన ఆ ప్రశ్నకు ఆటోవాడు అయోమయం ప్రదర్శించేలోపే నాలిక కర్చుకుని ''అబ్బా'' అని మూలిగాడు, తాటిపండు తలపైన పడ్డ నక్కలా.

''కోఠీకి వస్తావా'' అడుగుతూనే ఇంకో ఆటో కోసం వెతకసాగాడు చిదంబరం. ఎలాగూ వీడు ''నై నాబ్. సికింద్రాబాద్ జానా హై!'' అంటాడనుకుని.

''సార్! మీరు కూర్చొని ఉంటే ఈపాటికి కోఠీకి చేరుండేవాళ్లం. ఎవరైనా రావల్సిన వాళ్లున్నారా'' వెటకారంగానైనా, స్టైల్‌గా అడిగాడు ఆటో అతను.

పద్ధతి ప్రకారం ''రాను'' అంటాడనుకున్న ఆటో అతని మాటలు చిదంబరం చెవులకి జేగంటలయ్యాయి. ఆటో ఎక్కి కూర్చున్నాడు, తన వాళ్లకి ఆటో ఎలా ఎక్కాలో నేర్పించిన పద్ధతిలోనే.

చిదంబరం మరచిపోదామనుకున్నా చెప్పులు, బ్రష్, కాఫీ, చన్నీళ్లు అన్నీ గుర్తొచ్చి చిరాకును పెంచేస్తున్నాయి.

'డామిట్! పద్ధతి ప్రకారం నడుచుకోలేని వాళ్లని షూట్ చేసి పారెయ్యాలి' మనసులోనే అనుకుంటున్నాననుకుంటూ పైకి అనేశాడు చిదంబరం.

''నిజమే సార్! రెడ్ లైట్ దగ్గర ఆపినా పార్కింగ్‌లో బండి నిలిపినా, చలానా రాస్తాడు సార్, పోలీసోడు. మీరన్నట్టు వాడి గన్‌తోనే వాణ్ని షూట్ చేసి పారెయ్యాలి'' ఉత్సాహంగా అంటూ తనతో మాట కలుపుతాడేమోనని వెనక్కి తిరిగి చూశాడు ఆటోవాడు.

''వాడి గన్ లాక్కొని షూట్ చేసెయ్యాలి అని నేనెక్కడన్నాను'' అని అనబోయి, తను రాయబోయే గ్రంథం 'పద్ధతి ప్రకారం నడుచుకో' గ్రంథంలోని ఒక సూక్తి 'ప్రయాణం చేసేటప్పుడు ఆటోవాడితో మాటలు కలిపితే దిగంగానే ఎక్స్ట్రా డబ్బులు అడుగుతాడు. కాబట్టి వాడితో మాటలు కలుపకూడదు' అని గుర్తొచ్చి, ఎప్పుడూ చూడనిదేదో చూస్తున్నట్టు ఆటోలోంచి ఆకాశాన్ని చూస్తూ వాడి మాటలను గమనించనట్టు నటించాడు చిదంబరం, చిరంజీవులు సినిమాలో 'ఎన్టీఆర్'లా.

## వాళ్లు నా బెస్ట్ ఫ్రెండ్స్

**అందాల తారగానే కాదు, ఉత్తమ నటిగా కూడా అనేక అవార్డులు ప్రశంసలు అందుకుంటున్న స్నేహ తెలుగులో అగ్రశ్రేణి హీరోయిన్‌గా ఎదిగింది. టాలీవుడ్‌లో తనకి లభిస్తున్న ఆదరణకు ఎంతగానో సంబరపడే స్నేహ- ఇక్కడ తనకి ఇద్దరు హీరోలు బెస్ట్ ఫ్రెండ్స్ అంటుంది. వాళ్లెవరో కాదు, నాగార్జున-వెంకటేష్‌లట. నాగార్జునతో 'శ్రీరామదాసు', వెంకటేష్‌తో 'సంక్రాంతి' సినిమాల్లో స్నేహ నటించిన సంగతి గుర్తుండే వుంటుంది.**



ఆటో ఎక్కినప్పటి నుంచీ ఒకే భంగిమలో కూర్చున్న చిదంబరాన్ని చూస్తూ ''కోఠీ వచ్చేసింది సార్'' అరుస్తున్న లెవెల్లో చెప్పాడు ఆటోవాలా.

''అవునా?'' అంటున్న చిదంబరంతో-

''ఆటోలో కూర్చొని మన పరిసరాల్ని గమనిస్తుంటే తెలుస్తుంది, మనం ఎక్కడికొచ్చామో. ఎక్కినప్పటి నుంచీ ఎప్పుడూ చూడనట్టు, ఆకాశాన్నే చూస్తూ కూర్చుంటే ఎలా తెలుస్తుంది?'' కొంచెం కోపంగా గుడ్లురుముతూ అన్నాడు ఆటోవాడు. గుడ్లగూబలా, తనతో మాటలు కలుపలేదనే ఉక్రోషం కడుపులోంచి తన్నుకొస్తూంటే.

డబ్బులిచ్చి, ఆఫీసు వైపు హడావుడిగా వెళ్లిపోతున్న చిదంబరం-

''సార్! చిల్లర తీస్కోండి'' అన్న ఆటోవాడి గొంతు విని వెనక్కు వచ్చి, చిల్లర తీస్కుంటూ- ''కొత్తగా ఆటో నడుపుతున్నావా?'' అడిగాడు.

''అవున్సార్. ఎలా కనిపెట్టారు?'' ఆశ్చర్యంగా అడిగాడు ఆటోవాడు ఆశ్చర్యంగా.

''పద్ధతి ప్రకారంగా లేకపోతేనూ'' అనుకుంటూ ఆఫీసులోకి దూసుకుపోయాడు చిదంబరం, వింటి నుంచి విడివడిన బాణంలా.

ఆఫీసులో అడుగు పెట్టగానే...

''సార్! మీరు రాగానే అర్జెంటుగా కలవమని అయ్యగారు చెప్పారు'' కొంచెం కొంటెతనం కలిసిన స్వరంతో చెప్పాడు ప్యూన్.

'అనుకున్నా.. ఇవాళ పొద్దున్నుంచి జరిగినవి చూస్తుంటే..ఇలాంటిదేదో జరుగుతుందని అనుకున్నా...ఛీ...ఛీ...' అనుకుంటూ బాస్ గదిలోకి అడుగు పెట్టాడు చిదంబరం.

''రావోయ్, చిదంబరం! ఏంటీ ఆనందంగా ఉల్లాసంగా కనిపిస్తున్నావ్. సింథాల్ సబ్బుతో స్నానం చేశావా?'' అడుగుతున్న బాస్ ఫేస్‌ని తీక్షణంగా చూస్తూ 'ఏడిసావ్! ఫేస్ రీడింగ్ కూడా రానివాడివి బాస్‌వి ఎలా అయ్యావురా' ఎలుకని చూడగానే మీదపడి తినేసే పిల్లిలా ముఖం పెట్టి తిట్టుకున్నాడు చిదంబరం.

''అవున్సార్! ఇవాళ పొద్దున్నుంచీ ఎంతో ఆనందంగా ఉన్నాన్సార్.

అందుకే ఇంత ఉల్లాసం'' చెప్పులు, బ్రష్, కాఫీ, చన్నీళ్లు - బాస్ వెనక తెల్లటి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గోడ మీద పెద్ద పెద్దగా కనిపిస్తూండడంతో చేత్తో తలబాదుకుంటూ చెప్పాడు చిదంబరం.

''ఆనందంగా... ఉల్లాసంగా ఉన్నానంటూ, తల బాదుకోవడం పద్ధతి కాదోయ్'' అన్నాడు బాస్.

బాసు పద్ధతి గురించి మాట్లాడగానే చిదంబరానికి చిర్రెత్తుకొచ్చింది.

'పద్ధతి గురించి నీకేం తెలుసురా! కుక్కమూతి పిందె మొహమూ నువ్వూను. నీకేమైనా

తెలిసుంటే మటుకు నా దగ్గర మాట్లాడే దమ్ముందా. ఏదో ఆఫీసులో బాసువైపోయావ్ గానీ, లేకుంటే నీ ఫేస్‌కి, న్యూస్‌పేపర్లు ఏరుకుని బతకడమే ఎక్కువ. ఇక్కడ వాగావు కాబట్టి బతికిపోయావు. ఇంకెక్కడైనా పద్ధతి గురించి మాట్లాడి ఉంటే ఈపాటికి నీ బట్టలూడదీసి, మా వీధి గుమ్మానికి తలక్రిందులుగా వేలాడదీసి పద్ధతుల గురించి వాటి పుట్టుపూర్వోత్తరాల గురించి క్లాసు పీకి ఇహచాలు బాబోయ్ అనిపించి, చావగొట్టి చెవులు మూసి ఉండేవాడిని. వెధవాయ్'' అని తోద్దామనుకొని-

''ఏదో.. ఆలోచనలకీ, యాక్షన్లకీ పొంతన కుదరక అలా జరిగిపోయింది బాస్'' అన్నాడు చిదంబరం.

''సర్లే.. ఇప్పుడు నీ యాక్షన్ల గురించి ఎడిక్షన్ల గురించి ఎవడికి కావాలి. మన డిస్ట్రిబ్యూటర్స్‌కి ఇవ్వాల్సిన షిప్పింగ్ నెట్‌వర్క్ తాలూకు ప్రాజెక్ట్ రెడీ అయిందా?'' కొద్దిగా సీరియస్‌గా అడిగాడు బాస్.

''రెడీసార్. ఇవిగోండి'' ఫైలు అందించాడు చిదంబరం. ఫైలు చదువుతున్నాడు బాస్.

పొద్దున్నే ఏ రోజయినా పద్ధతులు గజిబిజిగా ప్రారంభమయితే, ఆ రోజంతా చిరాకుగా సాగుతుందన్న తన భావనకు తగ్గట్టుగా, ఫైలు చదువుతున్న బాస్ తన ఫేసులో ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ ఉండడం గమనించాడు చిదంబరం. చదవడం పూర్తవ్వగానే ఒక నిర్లిప్తమైన వెర్రినవ్వు నవ్వాడు. చిదంబరం కూడా ''హి...హి..హీ'' అంటూ అదే లెవల్లో ఒక నవ్వు జవాబుగా విసిరాడు.

''చిదంబరం. అసలు నెట్ అంటే అర్థం ఏంటయ్యా నీ ఉద్దేశ్యంలో'' కొంచెం సీరియస్‌గానే అడిగాడు బాస్.

ఆ ప్రశ్న ఎందుకడిగాడో అర్థంకాని చిదంబరం- ''వల సార్'' పద్ధతి ప్రకారం చేతులు కట్టుకుని సిన్సియర్‌గా జవాబు చెప్పాడు రెండో క్లాసు పిల్లాడిలా 'అది కూడా తెలీకుండా ఇంత పెద్ద కంపెనీకి బాసువెలా అయ్యావురా. ఏ.డి.జి.డి.' అని మనసులో తిట్టుకుంటూ. ఇలాంటి సీరియస్ మీటింగులలో, పెద్దవారిని తిట్టేటప్పుడు అడ్డగాడిదలాంటి పదాలకు తను కనిపెట్టిన షార్ట్ ఫాం ఒకటి పద్ధతి ప్రకారంగా వాడుకున్నాడు అలవాటు ప్రకారం చిదంబరం.

''ఓహో! నెట్ అంటే వల. నెట్‌వర్క్ అంటే వలతో చేసే పని. అంటే చేపలు పట్టడమనా నీ ఉద్దేశం'' అని బాస్ అంటూండగా... చేపలు పట్టడం అన్న పదం వినగానే చిదంబరం ఆలోచనలు పన్నెండు గంటలు వెనక్కి వెళ్లాయి.

క్రితం రోజు సాయంత్రం మచిలీపట్నం నుంచి వచ్చిన తన చిన్ననాటి స్నేహితుడు, తను చేయబోయే ఫిషింగ్ వ్యాపారానికి ప్రాజెక్టు రిపోర్టు రాసిమ్మంటే, రాసి ఆ ఫైలుని భద్రంగా అల్మరాలో పెట్టాగా. ఇప్పుడా విషయం ఈ బాసుగాడు ఎందుకడుగుతున్నాడబ్బా అనుకుంటూ-

''ఛ..ఛ. నెట్‌వర్క్ అంటే చేపలు పట్టడం కాదు సార్.. అదీ..'' చిదంబరం ఏదో చెప్పబోతూంటే-

''నోర్ముయ్, 'షిప్పింగ్ నెట్‌వర్క్' గురించి రిపోర్టు రాసుకురమ్మంటే, 'ఫిషింగ్‌నెట్‌వర్క్' గురించి రాసుకొచ్చింది గాక, అడిగితే నాకే సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తావా. తె.త.ద'' అన్న బాస్ గర్జన వినిపించి, తప్పు ఎక్కడ జరిగిందో, ఫైళ్ల మార్పిడి ఎలా జరిగి ఉంటుందో పద్ధతి ప్రకారంగా అర్థమవ్వసాగింది చిదంబరానికి ఒక్క పదం తె.తే.ద. తప్ప. తనకు తి.తి.దే! అంటే తిరుమల తిరుపతి దేవస్థానము అని తెలుసుకానీ, తె.త.ద. అంటే ఏంటో అర్థంకాక బుర్ర గోక్కుంటూ నిల్చున్నాడు.

''ఏం! నువ్వు చేసిన పొరపాటు ఏంటో తెలిసిందా? నా మాటలు నీకేమయినా అర్థమయ్యాయా?'' గద్దించాడు బాస్.

''అర్థం అయింది బాస్. ఒక్క పదం...'' పదాలను పొదుపు చేస్తూ, పద్ధతి ప్రకారం వాడాననుకుంటూ, నసిగాడు చిదంబరం.

''ఏంటీ, నేను ఇంతలా అరుస్తుంటే, నీకు ఒక్క పదమే అర్థం అయిందా. వేస్ట్. ఏదో పద్ధతి ప్రకారంగా ఉంటావు కదా అని నిన్ను ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పెట్టుకొని నీకు పెద్ద జీతం ఇవ్వడం వేస్ట్. శుద్ధ వేస్ట్'' ఉరిమాడు బాస్.

''ఒక్క పదమే అంటే.. అర్థం కానిది ఒక్క పదమే సార్'' కొంచెం దీనంగా ఏడుస్తున్న

## నాకెవరూ పోటీ కాదు

**తెలుగు నుంచి క్రమంగా తమిళంవైపు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్న తార త్రిష. ప్రస్తుతం తెలుగు కంటే తమిళంలోనే ఎక్కువ సినిమాల్లో నటిస్తున్న త్రిషకి- తెలుగులో ఇలియానా నుంచి గట్టి పోటీ వస్తోందనే కామెంట్స్‌కి ఆమె ఇటీవలే జవాబిచ్చింది. 'పోటీ అనేది వుంటేనే ఎవరైనా పట్టుదలతో విజయం వైపు ముందుకు సాగుతారు. ఇక ఇలియానాతో నాకు పోటీ అనే వ్యాఖ్యలకు నేనేమీ బాధపడను. మరో విషయం ఏంటంటే- ఇలియానా నేను మంచి ఫ్రెండ్స్‌మి. తెలుగులో మంచి పాత్ర అనుకుంటే తప్పకుండా నటిస్తూనే వున్నాను' అని సెలవిచ్చింది త్రిష. గతంలో శ్రియ నేను మంచి ఫ్రెండ్స్‌మి అన్న త్రిషకి ఇలియానా కూడా బెస్ట్ ఫ్రెండన్నమాట. వెరీగుడ్!**



లెవెల్లో చెప్తున్నాడు చిదంబరం.

''తె.త.ద. అన్న పదం ఇప్పటి దాకా విన్లేదు సార్. అదే అర్థం కానిది''

''తెలివి తక్కువ దద్దమ్మా, రేపటి లోపు ఈ దరిద్రపు ఫిషింగ్ ఫైలు స్థానంలో మన షిప్పింగ్ ఫైలు లేకపోయిందో నిన్ను సస్పెండ్ చేస్తా. కాదు కాదు, డిస్మిస్ చేసేస్తా'' ముఖేష్ ఖన్నా లెవెల్లో భీష్ముడిలా శపథం చేస్తున్నట్టు చెప్పాడు బాస్.

రేపటిలోగా.. సస్పెండ్.. డిస్మిస్, ఈ మూడు పదాలే చిదంబరం చెవుల్లో చిల్లులు పడే లాగా ప్రతిధ్వనిస్తున్నాయి.

'ఇదంతా చెప్పుల వల్లే జరిగింది' అనుకుంటూ బయటకు నడిచాడు చిదంబరం. ఎంత ఆలోచించినా ఫైలు ఎలా మారిందో అర్థం కావడం లేదు చిదంబరానికి. కాసేపటికి బుర్ర వేడెక్కి ఆలోచించడం మానేసింది పద్ధతి ప్రకారంగా.

ఆటోలో ఇంటికి వెళ్తున్న చిదంబరానికి, తన ఉద్యోగం ఊడినట్టు, తను జాలరివాడి లాగా వల భుజాన వేసుకొని చేపలు పట్టడానికి వెళ్తున్నట్టు, సునామీలో తన పడవతో పాటు తనూ కొట్టుకుని పోయినట్టూ శ్రీమతి, పిల్లలు పులిహోర ప్యాకెట్ల కోసం అర్రులు చాస్తున్నట్లూ గజిబిజిగానైనా పద్ధతి ప్రకారం ఊహలు రాసాగాయి.

''నో.. అలా జరగడానికి వీల్లేదు'' గట్టిగా అరిచాడు చిదంబరం.

''అలా జరక్కపోతే.. సిగ్నల్ జంప్ చేశానని, ఫైన్ కట్టమంటారు సార్ ట్రాఫిక్ పోలీసులు'' చెప్పాడు ఆటోవాడు వినయంగా.

తను రాయబోయే గ్రంథంలోని సూక్తి ప్రకారం, ఆటోవాడితో మాటలు కలపకూడదన్న సంగతిని కూడా మరచిపోయి,

''నేను జరుగకూడదన్నది వేరేలే. మంచి ఇంగ్లీష్ మాట్లాడుతున్నావు. ఇంతకీ ఏం చదువుకున్నావేంటి?'' అడిగాడు చిదంబరం.

''ఫిషరీస్‌కి సంబంధించి రిసెర్చ్ చేశాను సార్'' చెప్పాడతను.

''మరేమీ సంపాదించలేదా'' ఆసక్తిగా ముందుకు వంగి అడిగాడు చిదంబరం.

''ఈ ఆటో నా సొంతమే సార్''

అతని జవాబు విని, అదిరిపడ్డాడు చిదంబరం. తను కూడా ఫ్యూచర్‌లో ఆటో నడుపుతున్న సీన్ కళ్లల్లో మెదిలేసరికి, ఇక ఫిషింగ్ గురించి కూడా కలలు కనకూడదని నిర్ణయించుకున్నాడు. ఆటో దిగి, ఇంట్లోకి వస్తున్న పతిదేవుడిలో పద్ధతి ప్రకారంగా లోపలికి వచ్చే స్టైలు, రాగానే ఫీంకరించడమో, రంకె వేయడమో చేయకుండా, కోరలూడిన వృద్ధ పులిలా కుర్చీలో చతికిలపడిన మార్పుని చూస్తూ ఏమీ తెలీనట్టు,

''ఏమైందండీ'' అడిగితే ఏంటో, అడక్కపోతే ఏంటో అన్న అయోమయంతో వెనక్కి ఒక్క అడుగేసి, అడిగేసింది శ్రీమతి.

''ఏమేవ్. నీకు తెలుసు. నేనెంత పద్ధతిగా ఉంటానో. అలాంటిది, నిన్న ఎవడో నా క్లాస్‌మేట్‌నంటూ వచ్చి, చేపలు పట్టడాన్ని కూడా కార్పొరేట్ లెవెల్‌లో ఆవిష్కరిస్తానంటూ నా చేత ప్రాజెక్టు రిపోర్టు రాయించుకున్నాడు. షిప్పింగ్‌కి, ఫిషింగ్‌కి కన్ఫ్యూజ్ అయిపోయి, మన కొంప మీదకు వచ్చిందే''

చిదంబరం గొంతు బొంగురుపోయిన పిల్లిలా మారింది.

శ్రీమతి లోపలి నుంచి కాఫీ కప్పుతో పాటు, షిప్పింగ్ నెట్‌వర్క్ ఫైలుని తీసుకొని వస్తూ భర్త ముందర ఉంచి-

''ఏవండీ అవసరానికి మించితే, పద్ధతైనా పప్పుముద్దయినా ప్రమాదమేనండీ. పొద్దున్న చెప్పులు కాళ్ల దగ్గర లేనందుకు గంగవెర్రులెత్తి, మమ్మల్ని అందర్నీ హైరానా పెట్టి పద్ధతీ... పద్ధతీ అనుకుంటూ మీరు ఫైలు మారడాన్ని గమనించకుండా ఆఫీసుకు బయల్దేరారు. మీరలా వెళ్లగానే మీ ఫ్రెండ్ ఫైలు కోసం వచ్చినపుడు నేను గమనించి, ఆయనకి ఇవ్వకుండా మళ్లీ రమ్మని పంపించేశా'' ఇంకా ఏదో చెప్తున్న శ్రీమతిని మధ్యలోనే ఆపేస్తూ..

''చాలా థ్యాంక్స్. నిజంగా చెప్తున్నా. ఇకమీదట నువ్వు చెప్పినట్టే అతిగా పద్ధతి గురించి పట్టించుకోను'' అన్నాడు చిదంబరం.

''మరి.. మీరు రాయబోయే గ్రంథం మాటేమిటి?'' అడిగింది శ్రీమతి.

''ఇక గ్రంథం లేదు ప్రబంధం లేదు'' చిదంబరం చెప్తుంటే-

పద్ధతి ప్రకారం నడుచుకో... అన్న గ్రంథం రాస్తానని చిదంబరం అందరికీ చెప్తుండడం, అందరూ ఆయనని వెనకాల వెక్కిరిస్తూ ఉండడం, ఇకమీదట చూసే అవసరం కలుగదన్న నమ్మకం కలిగిన శ్రీమతి, తన మనసులోనే సలహా ఇచ్చిన చిదంబరం స్నేహితుడికీ, చక్కగా సహకరించిన బాసుకీ, ప్రాక్టికల్‌గా అర్థమయ్యేలా చేసినందుకు భగవంతుడికీ మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

''శ్రీమతిగారు.. ఏంటి ఆలోచిస్తున్నారు. నా మాట మీద నమ్మకం కలగడం లేదా?'' అంటూ దగ్గరకు తీసుకొని ప్రేమగా కౌగిలించుకుంటూ అడిగాడు చిదంబరం.

శ్రీవారు దగ్గరకు తీసుకున్న తీరు, కౌగిలించుకున్న పద్ధతి, ఏదో పద్ధతి ప్రకారం కాక, మనస్ఫూర్తిగా ఉండడంతో పూర్తిగా మారిపోయాడని నమ్మకం కలిగి సంతృప్తిగా, తన్మయత్వంతో కళ్లు మూసుకొని ముందురోజు రాత్రి డ్రెస్సింగ్ టేబుల్ కింద తనే దాచేసిన చెప్పులు కొద్దిగా బయటకు కనిపిస్తూంటే వాటిని కాలితో లోపలికి తోసేస్తూ, సహకరించినందుకు వాటికీ కృతజ్ఞతలు చెప్పుకుంటూ అతని కౌగిలిలోకి ఒదిగిపోయింది శ్రీమతి పద్ధతి ప్రకారంగా.

☆

## డ్రెస్ డిజైనర్ జ్యోతిక

**హీరోలను పెళ్లి చేసుకున్న హీరోయిన్లు పెళ్లి తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పేసి తెరవెనక ఆ హీరోగారికి సినిమా విషయాల్లో చేయందిస్తూ వుంటారు. ముఖ్యంగా కాస్ట్యూమ్ డిజైనర్స్‌గా అవతారం దాలుస్తుంటారు. తాజాగా జ్యోతిక కూడా పెళ్లి తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పేసి భర్త సూర్యకి సినిమాల్లో డ్రెస్సుల డిజైనింగులో సలహాలు సూచనలు ఇస్తోందని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. అంతే సినిమాల్లో నటించకపోయినా, టీవీ సీరియల్స్‌లో నటించడానికైనా ఆమె ఓకే అంటే సీరియల్స్ నిర్మించడానికి నిర్మాతలు ఉత్సాహం కనబరుస్తున్నారట. మరి జ్యోతిక ఆలోచన ఎలా వుందో!**

